# కాశ్మీర మజిలీలు

శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారు

## —: మునికుటీరము :—

బోండా కుటుంబమునకు ధన్యవాదము లర్పించి, అనంతరము ఆశ్రమము దిక్కుగ పయనమైతిని. ఊరివా రిరువదిమంది వెంట వచ్చిరి. మా చెరువు పచ్చనిచేలందు గలదు. అందచందములకును, పాడి పంటలకును నోచుకొనినది పాంచాలసీమ. గంభీర ఋగ్వేదవాక్కులు తొలుత ప్రతిధ్వనించినది పాంచాల హృదయమందే కదా! ఆర్థికముగను, ఆధ్యాత్మికముగను, భారత చరిత్రయందు ముందు మిక్కిలి గణుతికెక్కిన దిదియే! ప్రాతఃకాలమున పొలమున నడుచుచుండగా బహుళ చరిత్రాంశములు మనసున దిర్దిర దిరుగదొడగినవి. కనుయెదుట నొప్పారు సౌందర్యము మనసును హరించినది. తోడివారు బాబాజీ మహాత్మ్యమును ఆవేశభరితహృదయులై ఉగ్గడించుచు, తోడ్తోడన తత్త్వశాస్త్ర మతశాస్త్రము లందలి తమ ఘనపాండితిని ప్రదర్శించుచు, చీటికి మాటికి తులసీ రామాయణమందలి చరణములను హావభావములతో నెకరువుపెట్టుచు నడువదొడగిరి. ఉత్తర హిందూస్థానమున పామరహృదయములకు కడుంగడు సన్నిహితమైనది తులసీరామాయణము. రామునివలన తులసీదాసును, తులసీదాసువలన రాముడును నౌత్తరాహులకు దైనికజీవితమున దగ్గరి చుట్టములైరి. తమ జీవితతత్త్వమువలన, రచనామహత్త్వమువలన అసంఖ్యాకులకు అన్నికాలములందు సన్నిహితులై యుండజాలు గ్రంథకర్తలు ధన్య జీవులు కారా? పూర్వోక్త బాలకుడు ఒక పర్యాయము తులసీదాసు రామాయణమునుండియు, శ్లోకములు భగవద్గీత నుండియు భావబంధుర వాక్కులనుచ్చరించుచున్నాడు. ఇట్టి పాండితిని, ఇట్టి భక్తిని పలువురు (నేను పండితుడననియు, భక్తుడననియు భ్రమసి) ప్రకటించుచుండ మిన్నకొనియుంట నాకు తగదని, నా గౌరవమునకు వారి సద్భావమునకు బన్నము దెచ్చునని యూహించి నాకు తెలిసిన ముక్కలను భైరవి రాగముతో నాలపింప సాగితిని. దాక్షిణాత్యులవలె నౌత్తరాహులు రాగాలాపన మొనరింపలేరు. నా "భైరవి"లో ముఖారి తక్క తక్కిన రాగములన్నియు యథేచ్ఛగా జొరబడుచున్నను, నడచుచు నడచుచునే చేయు రాగాలాపనము నాగుండెలనే దడదడలాడించుచున్నను, "వా! వా! బహుత్ అచ్ఛా!" అని మిత్రులు నన్ను ప్రశంసింపదొడగిరి. వారు ప్రశంసించిన కొలది నా యావేశ మధికమైనది. గీతకును, తులసీ రామాయణమునకును సంబంధించిన స్టాక్ ముగియగనే, తెలుగు శతకములనుండి చిత్తము వచ్చినట్లు పద్యములను విసరదొడగితిని. వివిధ శతకములందలి పద్యపంక్తులను మిళాయించి, సొంతధోరణి గొంత నానిలో గలిపి, ఒక్కొకపుడు స్వంతగద్యమును రాగధోరణిలో ప్రవేశబెట్టి బహుభంగుల నా ప్రజ్ఞను ప్రకటించితిని. కూడ తెలుగు సైదో దెవ్వండైన నుండినయెడల నాధోరణిలోని గుట్టుమట్టులను బయల్వెట్టి రసాభాసము గావించియుండును. బోండా బుడంకాయలు మాజట్టులో ప్రవేశింపక తమ ధోరణిలో తాముండిరి. ఒక నిముసము కోపోద్దీపితులై, వేఱొకనిముసము పరమానందభరితులై వారు వింత రీతుల ప్రవర్తింపసాగిరి. ఉదరభారమువలన బోండా ఊగిసలాడుచు నడచుచుండగా పొట్టిపిలికి పకపక

నవ్వుచు, చప్పట్లు కొట్టుచు, రాగధోరణిలో నఱచుచు, బోండాచుట్టు గంతులువేయుచు మావెన్కనుండి వచ్చుచున్నాడు. నాటి ప్రభాతప్రయాణము నాకెంతో వేడుక గలిగించినది.

దూరము అరమైలని బాలకుడు తెలిపినాడు కాని రెండుమైళ్ళకది తక్కువ యుండదని గ్రహించితిని. మునికుటీరమును మేము చేరుసరికి జాము ప్రొద్దెక్కినది. కుటీరమున కివ్వల మూడుమంటలు మెల్లమెల్లగా కాలుచున్నవి. సమీపమున బూడిదరాశి యున్నది. బావాజీ అదూరమున గూర్చుని మెల్లమెల్లగా నేమేమో యనుకొనుచున్నాడు. అతని యొడలంతయు భస్మములో వెలయుచున్నది. దీర్ఘమైన వాని గడ్డము నెరసినదని తెలుపలేనుగాని బూడిదవలన నది నెరసినట్లే యగపడుచున్నది.

ఉత్తరహిందూస్థానీయులకు యోగులనిన ప్రీతి మెండు. ఈ యోగులందఱు నిక్కంపు దపశ్శాలురని తెలుపజెల్లదు. కాని, కొందఱు కొందఱు నిక్కంపుజోగులని తలచుట అనుచితము కాదు. ప్రశాంత పవిత్రవాతావరణమున వసించుచు, పెక్కునాళ్లు ఉపవాసములు సలుపుచు జపతపములు చేయు మహాత్ములు నేడును గలరు.

స్వాంత ముక్తిమీదనే మనసుంచువారని యిట్టివారిని నేడనేకులు జుగుప్సతో వీక్షించుచున్నారు. సాంఘిక సేవాధురంధరుల కగ్రస్థానమొసగి యోగులకు గెటే ప్రభృతులు తమ పూజాగృహమున ద్వితీయ స్థానము నొసగిరి. భావోపాసనముపై, మనననిదిధ్యాసనములపై, గభీరధ్యానముపై, అవిచలితసమాధిపై, మహిమపై మనసుంచువారు సర్వకాలములందు, సర్వసీమలందు మానవసముద్ధరణమునకు తోడుపడు భావసృష్టి గావింపగలరు. భావశక్తి దృష్టాంతరశక్తులు మహత్తరములు కదా! మునిముఖ్యులను మునిమ్రుచ్చులని వచింపరాదని నావినీతాభిప్రాయము.

ఎల్లఱము స్వామిజీమ్రోల సాగిలపడితిమి. చిరపరిచితులవలె దోడివారు మునిమ్రోల నన్నెంతో భూషించుచు విరాగితో నాకు పరిచయము గలిగించిరి. అమాయికుల భూషణ కెట్టి యాధారమును ఉండనక్కఱలేదు కదా! స్వామీజీ నన్నతివాత్సల్యముతో విలోకించి, దాక్షిణాత్యక్షేత్రములను గుఱించి కొంతసేపు ముచ్చటించి మిత్రులనందఱి నలరించెను.

ఆపూట ఆశ్రమమందే కడచినది. అంతేవాసి యొకడు అందఱకు ఎంతో ప్రసాదమొసగినాడు. ప్రసాదము హల్వా! ఉత్తరహిందూస్థానీయులకును, హల్వాకును పూర్వజన్మమందు దగ్గఱి చుట్టఱిక ముండియుండును. కావుననే యీజన్మమందును వారు దానినేపట్టి ప్రాకులాడుచుందురు. అతిథుల కొసగెడు ఫలహారమున కనుడు, దేవతల కొసగు ప్రసాదమున కనుడు హల్వానే వారు ప్రయోగించుచుందురు. హల్వాకును ఔత్తరాహులకును నెట్టి సఖ్యముండెనో దానికిని, నాకును తొల్లింటి భవమున నట్టి వైరముండియుండును. హల్వా ప్రత్యక్షమైనంతనే నాకు పట్టరాని ఆగ్రహము కలుగుచుండును. దురదృష్టమేమని తెలుపుదును? ఉత్తర హిందూస్థానమున ఆశ్రమములందును, ఆలయములందును, మిత్రసదనములందును అదియే నాకు తప్పని సరిగ ప్రత్యక్షమయ్యెడిది. హల్వాకును, నాకును చుట్టపుజూపు లుండరాదను నంశము నెఱుగక ప్రేమపూర్వకముగ మిత్రులు దానిని నామ్రోలనిలిపినపుడు ఆంతరంగికముగ నేబడు బాధ జగదీశునకే యెఱుక. దానిని ప్రత్యక్షము జేసిన వారొరులైనచో నమస్కరించి, ఆ పాపిష్ఠపు సరుకును తక్షణమే సమ్ముఖమునుండి తొలగింపుడని కంఠమెత్తి వచించువాడను. ఆదరానురాగములతో మిత్రులు దానిని ముందుంచినపుడు అట్లు వచించుటకు మనసెట్లీయకొనును? ప్రేమను ప్రతిఘటించుటకు పిశాచమునకైన సాధ్యము కానపుడు మానవునకెట్లు సాధ్యమగును? స్వతస్సిద్ధమైన హల్వాతీపికి మధుర

ప్రేమరసము మఱింత తియ్యందన మొసగుననుట స్పష్టాంశమే కదా! ద్విగుణీకృతమైన మాధుర్యముతో నొప్పు నీపదార్థము నెట్లో నోట బెట్టుకొనుట నాకు విధియయ్యెడిది. గుండెలు దడదడలాడ నోటజొచ్చు పదార్థ మెంతయుండును? నలుసంతహల్వా నాల్కపైబడినంతన గొంతసేపు వమనము నరికట్టుటకై విశేష యత్నము సలుపవలెనుగదా! ఈ ప్రయత్నమునకు భంగము ఘటించిన నెట్టి రసాభాసము సృష్టికాదు? ఈ పరిస్థితులలో ముఖ్యాహారముగనే హల్వా యొడ్డింపబడుచో "హా! హావిధీ!" యని నొసలు చఱచికొనకుండు టెట్లు?

ఆశ్రమమున నేడు ప్రత్యక్షమైన హల్వాను ఆహారముగనే పరిగణింపవలెనని గ్రహించితిని. అదే ప్రసాదము! అదే ఆహారము! పరిమాణమునుబట్టి, వేళనుబట్టి భావమును గ్రహించుట కష్టము కాదు. మిత్రవరేణ్యులు హల్వాతోనే ఉదరములు పూరించిరి. నేనేమి చేతును? ఆశ్రమములో చేయవలసిన తపను చపాటీలకా? ఎదుటి యాకులోని పెద్దముద్ద "ముట్టు"మని నన్ను సవాలుచేయుచునే యున్నది. పరమానందముతో నిరువదిమంది దానినారగించుచు "పాయియే పండిట్జీ!" ("ఆరగింపుడు అయ్యా!") అని బలవంతపెట్టిరి. కొంతసేపు నిర్విణ్ణుడనై కూర్చునియున్నను, దాపురించిన ముప్పును దూరముగ నెట్టించు నుపాయ మెఱుగక జంకుచు గొంకుచు కొంతముద్దదీసి నోటబెట్టి తక్షణమే గ్రుక్కెడు నీటిని నోటబోసికొని హల్వా నెట్లో దిగమ్రింగి యిక గూర్చుండక లేచి చేతిని, మూతిని కడుగుకొని "అమ్మయ్యా" యని స్వామిజీ ప్రక్కజేరితిని. కొంతసేపటిలో మహాశయులందఱు వచ్చి చేరిరి. వారి ప్రసంగ ధోరణివలన నాశ్రమమున కగు వెచ్చమును ఊరివారే వహింతురని గ్రహించితిని. నాది పిట్టతిండియని అపోహపడి కాబోలు మఱియాహారము మాట మిత్రులెత్తిరి కారు. ఉదయమున ఉదరమున మామూలుగా పడవలసిన తేనీరు పడలేదు. ఇపుడు భోజన మీ రీతిగా జరిగినది. కడుపులో ఖగబగ మండుకొనిపోవుచున్నది. బుడంకాయ కడుపార భుజించి బోండాతో ఎంతో బిజీగా ఇష్టాగోష్ఠి సలుపుచున్నాడు.

ఇక నందుండి తరల నిశ్చయించి స్వామిజీ సెలవు వేడితిని. "కొలదిదినము లిందుండుటకు మీకు వీలు లేదా?" అని బావాజీ పలికెను. హల్వా కొంత అడలు గొలిపినను, శాంతినిలయమైన ఆ యాశ్రమమున గొన్నిదినము లుండవలెనని మక్కువపడితిని. కాని ఉండుటకు వీలు లేదు కదా! తద్దినపు సంగతి తెలిపి సెలవు బడసి "సాధ్యమగుచో వేఱొకమారిచటికి వత్తు"నని యోగీంద్రున కెఱిగించి, అతని యాశీస్సులంది అనుచరునితో పయనమైతిని. రోడ్డు వఱకు నూరిసెయ్యారులు వచ్చిరి. దారి వారికి పరిచితమైనది కావున నవలీలగ నీ మూఁడు మైళ్ల పొలమునుండి దాటిపోతిమి. అప్పటికి ఒంటిగంట దాటెను. ఈ పర్యాయము బస్సుకై విశేషకాలము తడయ నక్కఱ లేకపోయెను. అదృష్టము! అమృతసరమునుండి లాహోరుపోవు బస్సు అచిరములో వచ్చి, మేము చేసన్న జేసినంతన సమ్ముఖమున నాగినది. దీని వాలకమంత ఘోరముగా నగపడలేదు. ఈశ్వరుడు దయామయుడు కదా! మిత్రులము ఒకరినొకరి నుద్దేశించి "నమస్తే!" అనుకొంటిమి. బోండాకు మఱొకమాఱు ధన్యవాదము లర్పించి బుడంకాయతో పోయి బస్సులో ప్రవేశించితిని. మరల నమస్తేలు వినిపించినవి. బస్సు చరచర సాగిపోయినది.